క్లుప్తంగా

విద్యుత్‌లైన్‌తో ఇబ్బందులు



రొద్దం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు అడ్డంగా మారిన విద్యుత్ లైన్

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే 11 కేవీ విద్యుత్ లైన్ ఇళ్లపై ఉండడంతో ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకిగా మారిందని లబ్ధిదారులు వాపోతున్నారు. సెల్ టవర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ మార్చాలని పలుమార్లు సంబధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌లైన్ మార్చాలని విన్నవిస్తున్నారు.

సీహెచ్‌ఓలకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రభుత్వాస్పత్రిలో శిక్షణ పూర్తి చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు సర్టిఫికెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించడానికి ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గత వారం రోజులుగా 6వ బ్యాచ్‌కు శిక్షణను అందించగా శుక్రవారం ముగిసింది. నోడల్ అధికారి వన్నప్ప, శిక్షకులు అమరప్రియ, రాధిక, రమణల చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా వన్నూరప్ప



కమిషనర్ ప్రమోద్‌కు ఉత్తర్వులను అందిస్తున్న న్యాయవాది వన్నూరప్ప

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో హిందూపురం మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.ఎల్.వన్నూరప్పను నియమిస్తూ లీగల్ అండ్ లెజిస్ట్రేటివ్ అఫైర్స్ ప్రభుత్వ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాల్టీ ఆస్తుల పరిరక్షణ, న్యాయపరమైన సమస్యలపై మున్సిపల్ న్యాయవాదిగా మూడేళ్ల పాటు ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వన్నూరప్ప శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి ప్రభుత్వ ఉత్తర్వులను అందజేశారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి

అమరాపురం: మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన మహిళలు మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందజేయాలని శుక్రవారం మండల పరిషత్ ఏఓ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 360 కుటుంబాలు ఉన్నాయని 300 కుటుంబాలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలన్నారు.



రొద్దం: కనుమరలో ఆంజనేయుడికి జ్యోతులు మోస్తున్న మహిళలు



గోరంట్ల: యర్రయ్యగారిపల్లిలో జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు



అగళి: పాండు రంగస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక శోభ

- తొలి ఏకాదశి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జ్యోతులు, రథోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పరిగి: మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో తొలి ఏకాదశి సందర్భంగా శుక్రవారం రథోత్సవాలు, గ్రామోత్సాలు, జ్యోతుల ఉత్సవాలు జరిగాయి. భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్న పరిగి మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉట్లమాను పరుష వైభవంగా జరిగింది. అలంకరించిన ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఎదురుగా ఉట్లమాను ఉత్సవం కూడా ఘనంగా జరిగింది. మరోవైపు పరిగి మండల సరిహద్దు కర్ణాటక ప్రాంతమైన పెద్ద దాళవాటంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోరంట్ల: యర్రయ్యగారిపల్లిలో చెన్నకేశవస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఎడ్లబండ్ల ప్రదర్శించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

పావగడ తాలూకాలోని కడమలకుంట సమీపంలో కొండ ప్రాంతంలో ఓబుళ నరసింహస్వామి జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గొరవయ్యల సాంప్రదాయక నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే మీనకుంటపల్లిలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.

మడకశిరరూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెళవాయి ఎస్సీ కాలనీవాసులు తిమ్మప్పస్వామి, రంగనాథస్వాములకు జ్యోతులను సమర్పించారు. బుళ్లసముద్రంలో లక్ష్మీనరసింహస్వామికి మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు.

అగళి: స్థానిక పాండురంగ విఠాల స్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మరథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు.

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి పంచాయతీ కనుమర గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శుక్రవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో జ్యోతులు సమర్పించారు. అలాగే ఆర్.కుర్లపల్లి సమీపంలోని ముక్కాంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



పరిగి: పెద్దదాళవాటంలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర రూరల్: మెళవాయిలో తిమ్మప్ప స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



పావగడ: కడమలకుంటలో గొరవయ్యల ప్రదర్శన



పరిగి: బాలిరెడ్డిపల్లిలో ఉట్లమాను పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

హిందూపురం: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జాబితా విడుదల అయింది. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మున్సిపాల్టీ పరిధిలో సీ1 విభాగంలో 1, 2,10,17 నుంచి 23 వార్డులతో పాటు 25, 26, 28, 32 నుంచి 38 వార్డులకు జేసీఎస్ మండల ఇన్‌చార్జిగా ఆర్.శివశంకర్‌రెడ్డిని నియమించారు. అలాగే సీ2 విభాగంలో 3 వార్డు నుంచి 16 వార్డులతో పాటు 24, 27, 29, 30,31 హెచ్.నౌషాద్, లేపాక్షి మండలానికి వి.చంద్రప్రసాద్, హిందూపురం గిరిష్‌బాబు, చిలమత్తూరు హనుమంతరెడ్డిలను నియమించారు.

మడకశిర: నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీకి జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిర మున్సిపాలిటీకి ఈశ్వర్, అగళికి శివన్న, రొళ్లకు నాగేంద్ర, అమరాపురంకు శ్రీనివాస రెడ్డి, మడకశిర మండలానికి నాగేంద్రయాదవ్, గుడిబండకు శివ కుమార్‌లను నియమించారన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

హిందూపురం టౌన్: వానాకాలం వస్తోంది, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఐఎంఏ హిందూపురం బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు, వైద్యులు నరసింహారెడ్డి, సుప్రవీణ్ తెలిపారు. వానాకాలంలో పిల్లలకు డెంగీ, మలేరియా, మెదడు వ్యాపు వ్యాధి, ఫ్లూ ఇతర జబ్బులు సోకే ప్రమాదముందన్నారు. పిల్లలకు ఫ్లూ టీకాలు వేయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే కరోనా సమయంలో రోగులకు డాక్టర్లు చికిత్స చేయడంలో, కట్టడి చేయడంలో తమ ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడారన్నారు. వారి సేవలు అభినందనీయమంటూ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం చౌళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనూరాధ, విశ్వనాథరెడ్డి, ఆనంద్, రామాంజనేయులు, బాలమధుసూదన్‌రెడ్డి బదిలీ అయ్యాయి. దీంతో శుక్రవారం పాఠశాల ఉద్యోగుల బృందంతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి కార్యక్రమానికి హాజరై బదిలీ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, లోకేష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత

మడకశిర: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు డీడబ్ల్యూఎం ఏపీడీ జయసింహ తెలిపారు. మండలంలోని రైతులకు పండ్ల తోటల పెంపకంపై శుక్రవారం సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. మండలంలో 65 మంది రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. 130 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచడానికి రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. రైతులు పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు వస్తే పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ-యాప్‌పై అవగాహన

పెనుకొండ: ఈ యాప్‌పై ఆశా వర్కర్‌లకు వైద్యాధికారి సౌమ్య శుక్రవారం అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఆశావర్కర్లు తాము చేసే పనులకు సంబంధించిన వివరాలను ఈయాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చంద్రశేఖర్, సుశీలమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

3న రక్తదాన శిబిరం

వజ్రకరూరు: మండల కేంద్రంలో జూలై 3న గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గోపీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచు మోనాలిసా తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపండి

పెనుకొండ: పట్టణంలో కోట లోపల జైన్ దేవాలయం సమీపంలో నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ పనులను వెంటనే ఆపాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

గర్భిణులకు అన్నదానం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. అంతకు ముందు సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలంలోని వానవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని కొలిమిపల్లి, గుంటిపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు. ఉదయం 11 గంటలకు కొలిమిపల్లిలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రికార్డు రూమ్‌లోకి ప్రైవేటు వ్యక్తులు !

చిలమత్తూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూమ్‌లో ప్రైవేటు వ్యక్తులు వెళ్లినట్లు తెలిసింది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కొందరు వ్యక్తులు ఓ వీఆర్‌ఓ సమక్షంలో రికార్డు రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకొని రికార్డులు పరిశీలించినట్లు సమాచారం. రికార్డు అసిస్టెంట్ లేకపోగా వీఆర్‌ఓలనే నేరుగా రికార్డు రూమ్‌లలోనికి అనుమతిస్తున్నారు. తహసీల్దార్‌ను ఇదే విషయంపై వివరణ కోరగా... రికార్డు అసిస్టెంట్ లేకపోవడంతో వీఆర్‌ఓలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అయితే రికార్డు రూములోకి ప్రైవేటు వ్యక్తులు ఎవరు వెళ్లారన్న విషయం తెలియాల్సి ఉంది.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రొళ్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఈఓ శ్రీధర్, ఎల్‌ఐసీ డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపాన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ న్యాయం



అగళి: జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్



రొద్దంలో జగనన్న సురక్షపై సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం నిడ్రఘట్టలో ఇంటింటి సర్వే నిర్వహించారు. శనివారం నిడ్రఘట్ట గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరోవైపు మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సచివాలయ కన్వీనర్లు, నాయకులతో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంపై ఎంపీపీ ఈరన్న సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి గ్రామ సచివాలయాల్లో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని మణూరు రైతు భరోసా కేంద్రంతో పాటు జీవీపాళ్యం గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటల నుంచి జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. శుక్రవారం క్యాంపులకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.

గుడిబండ: నేడు చిగతుర్పి గ్రామ పంచాయతీలో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. చిగతుర్పిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వం తెలిపిన 11 ముఖ్య సర్వీసులను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు.

అగళి: మండల పరిధిలో కోడిపల్లి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఆ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక కామరాజు, సర్పంచ్ నరసింహమూర్తి, ఈఓఆర్డీ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ తదితరలు పాల్గొన్నారు.

గోరంట్ల: అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు సచివాలయాల ద్వారా 11 రకాల ఉచిత సర్వీసులను అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు. శనివారం వానవోలు 1, 2 సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

రొద్దం: మండల పరిధిలోని రెడ్డిపల్లి, దొడగట్ట గ్రామ పంచాయతీల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గృహసారథులు, వాలంటీర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జగనన్న సురక్షపై శుక్రవారం ఇంటింటా సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ చెప్పారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి-1 సచివాలయంలో జగనన్న సురక్షా కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ నరసింహానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు హాజరు కావాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి వీలుగా మూడు టీంలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు తెలిపారు. 20 వార్డుల్లో కూడా ఈ మూడు టీంలు జూలై 4, 7, 11వ తేదీల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటాయన్నారు.

పరిగి: మండలంలో నేటి నుంచి ఈనెల 28 వరకూ అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. ఇందు కోసం తహసీల్దారు, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దారు, ఈఓఆర్డీ రెండు జట్లుగా ఏర్పడినట్లు పేర్కొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగులో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకరప్ప తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.